


# కొత్త వెలుగు

సంగిపాగి ఆనందరాజు

సాయంత్రం అయిదు గంటల కావొస్తున్న కూలిపని కెళ్లిన కోడ లింకా ఇంటికి తిరిగి రాలేదని గడప కో పక్కగా తడికెల తలుపు కానుకొని ఎదురుచూస్తూ కూర్చుంది ఆరు పదుల్ని ఆరోగ్యంగా దాటిన యల్లమ్మ.

ఉండుండీ వీస్తున్న చల్లని ఈదురుగాలికి తట్టుకోలేక ఒంటికి కప్పుకున్న అతుకుల బొంతను మాటిమాటికి సర్దుకుంటూ, తలవీదనుండి చెవులవీదుగా ఒళ్లంతా కప్పుకుంటూ గువ్వలా ఒదిగొదిగి ముడుచుకుపోతోంది యల్లమ్మ.

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానకు గుడిసెంతా కారుతోంది. గుడిసెపైన ప్లాస్టిక్ కాగితాలు కప్పడం వలన గుడిసె మధ్యన అక్కడక్కడ వర్షపునీళ్లు పడడం లేదు. మిగతా చోట్లంతా నీళ్లోడుస్తున్నాయి. నీళ్లోడుస్తున్న చోట్లంతా చెంబులు, గ్లాసులు పెట్టి వర్షపు నీళ్లను పడుతున్నారు. గడప పై భాగంలో నాపరాయి వేయడం వలన గడపలో వర్షపునీరు పడడం లేదు. ఆ గడపలోనే పొద్దుట్నుంచీ తల దాచుకుంటోంది యల్లమ్మ.

అప్పుడే స్కూలొదిలారు కాబోలు. యల్లమ్మ మనవళ్లిద్దరూ టోపీలాగా చేసుకున్న ప్లాస్టిక్ కాగితాల్ని తలపై పెట్టుకొని, ప్లాస్టిక్ క్యారీ బ్యాగులో పెట్టుకున్న పుస్తకాల్ని సంకలో గట్టిగా అదుముకొని వర్షంలో పరుగెత్తుకుంటూ వచ్చారు.

వచ్చీ రాగానే, 'యవ్వా! మా యమ్మింకా రాలేదా'ని అడిగారు.

'యాడొచ్చింది? తవమాట నారేయడానికి పొద్దున తొమ్మిదిగంట లప్పుడు పోయిరి. పొద్దుగూకుతున్నా ఇంకా రాలేదు. నడుమ ఇదొకటి జిన్ను జిన్నుమని వోన సినుకులు. నిన్నట్నుంచి వొదలడం లేదు. ఇట్లా టోనలు వొస్తేనేం, రాకపోతేనేం? సెట్టూసేమ కేమయినా మేలు సేస్తుందాంటే, అదీ లేదాయె. ఇట్లయితే మనబోటి పేదసాధు లెలా సేసుకొని తినేది? ఎట్లా బతికేది? యేం పోయేకాల మొచ్చిందో ఏమో?!' అంటూ విచారంగా యల్లమ్మ చెబుకుంటూ పోతుంటే--

'బంగ్లాకాతంలో తుపానట. ఇంకా నలభై ఎనిమిది గంటలు వాన కురుస్తాదంట...మా సార్ సెప్పె' అన్నాడు యల్లమ్మ పెద్ద మనుమడు శీనుగాడు, పుస్తకాల సంచీని గూట్లో పెడుతూ.

'ఎన్రోజు లైతేనేంలే. వొచ్చే వోనను వద్దంటే ఆగుతుందా? ఆ సెంబులు, గలాసులు, నిండింటాయి. ఆ నీళ్లు బయట కెత్తి పార బోయిరా నీకు పుణ్యమొస్తాంది' అని శీనుగాణ్ణి పనికి పురమాయించింది.

## సెక్స్ వల్ల ఆరోగ్యం

దాంపత్యజీవితం గడపటం వల్ల ఆరోగ్యం బాగుంటుందని అందరూ అనుకునే మాట. ఎలాగంటే, రెగ్యులర్ సెక్స్ వల్ల కండరాలను దృఢంగా వుంచే, మెటబాలిజంను పెంచే హార్మోన్ల ఉత్పత్తి ఎక్కువవుతుంది. స్లీప్ హార్మోన్‌లో పెరుగుదల కలిగి మంచి నిద్ర పడుతుంది. కొన్ని పరిశోధనల వల్ల మరో విషయం కూడా తెలిసింది. ఏ దంపతులు ఆనందదాయకమైన లైంగికజీవితాన్ని గడుపుతారో, వారి ఆయుస్సు పెరుగుతుందట!

ఎన్.

శీనుగాడు వర్షపు నీటికి నిండిన చెంబుల్లోని, గ్లాసుల్లోని నీళ్లను బక్కెట్ లోకి పోసి, బక్కెట్లోని నీళ్లను బయట కెత్తి పారబోస్తుంటే, యల్లమ్మ చిన్నమనుమడు సిన్నోడు ఎండిన రొట్టెముక్కల్ని కొరుకుతూ యల్లమ్మ పక్కన కూలబడ్డాడు.

యల్లమ్మ సిన్నోడి తలను ఆప్యాయంగా నిమిరి, తన వొళ్లో కూర్చోబెట్టుకుంది.

వర్ష మేమాత్రము తగ్గలేదు.

వర్షానికి తడిసి తడిసి ముద్దైన ఆడ కూలీలు బిలబిలమంటూ వర్షంలో పరుగెత్తుకుంటూ పోతున్నారు.

'ఒసేవ్, సుంకక్కా, మా పిల్ల రామలచ్చిమి రాలేదా?' అనడిగింది యల్లమ్మ.


'వొస్తిమొస్తివి. అందరమొస్తిమి' అని వెనుతిరిగి చూచి, 'అదిగో ఆడొస్తూంది మీ రామలచ్మి వెన్కలా' అని చెయ్యెత్తి చూపించి, తన ఇంటి ముఖం పట్టింది సుంకక్క.

రామలక్ష్మి వర్షంలో బాగా తడిసిపోయి వచ్చింది. పైనుంచి కిందిదాకా నీళ్లొడుస్తున్నాయి.

'ఈ వానలో పోకపోతే మనకు తప్పింది కాదు. ఈ బొందిలో పానమున్నంత వరకు మన కడుపు కాకలి వుంటుంది. మన కడుపుకాకలి వున్నంత వరకు మన కీ కష్టమూ వుంటుంది' ఎక్కడనో శూన్యంలో దృష్టి నిలిపి వేదాంత ధోరణిలో మెల్లగా నసికింది యల్లమ్మ.

తడిసిన తలను విదిలించుకుంటూ, నీళ్లోడుతున్న బట్టల్ని పిండుకుంటూ, 'నీ కొడుకు రాలే దాత్తా?' అనడిగింది రామలక్ష్మి.

'వా డీయాళకే యాడొస్తాడు. అతనెవరో మొన్న వోట్ల పండుగప్పుడు గెలిసినవాడు సూడు, అతన్నేమో ఎమ్మెల్లో, పమ్మెల్లో అంటారు సూడు, అతని ముంద్ర గంగ్రెద్దులా తలకాయ ల్లూపి, వాణ్ని కొట్టమంటే వాణ్ని కొట్టి, ఈణ్ణి తన్నమంటే ఈణ్ణి తన్ని, బాగా తాగి తందనాలాడి, పడుతూ లేస్తూ ఏ అర్ధరాత్రికో, ఏ అపరాత్రికోగాని ఇల్లు సేరడు.



స్సీ! వాడేం మనిసి. నా కడుపున సెడు పుట్టిండు. పెద్దోడు సీనుగాడు పొద్దున బడికి పోయేటయంకల్లా కొండకు పోయి బోదగడ్డి కోసుకొచ్చి ఇంటిముంగల కుప్పేస్తే, ఆ లసుముగాణ్ణి పిలుసుకొచ్చి గుడిసె కప్పియ్యడాని కేమయింది వానికి.

అవునిది వోనకాలం. నాకు పెళ్లాం పిల్ల లున్నారు. మా యమ్మకూడా వుంది. ఈ వోనకాలం యాడ కూసునల్లా, యాడ పడుకోవాలని వాని కేమయిన బుగులుగాని, దిగులుగాని వుందా?

మీ మామ వుండె. కా నిట్లుండలేదు. పగలంతా రెడ్డోల్లింట్లో, రెడ్డోళ్ల సేన్లో ఆ పని ఈ పని సేసి దీపమంటించే సరికి ఇల్లు సేరుకుంటుండె. ఆ మానుభావుడు సచ్చి ఇప్పు డేలోకంలో వున్నాడో తెలియదుగాని, నన్నూ తనతో తీస్కోపోయిన బావుండేది. ఈ కష్టాలు, కన్నీళ్లు నే సూడలేను' అంటూ చెమ్మగిల్లిన కళ్లను కొంగుతో తుడుచుకుంటూ కష్టాల్ని ఏకరువు పెట్టుకుంది.

అక్కడున్న ఆ కుటుంబ సభ్యుల హృదయాలు దుఃఖపూరితమైనాయి.

పడుతున్న చినుకుల శబ్దం తప్ప అంతా నిశ్శబ్దం. ఒక విషాదపు వాతావరణం అలుముకుంది.

ఆ విషాదపు వాతావరణాన్ని భగ్నం చేస్తూ 'వూ... సేయమ్మ సేయ్. ఏముందో, ఏం లేదో సూసి రాతిరికి తినడానికేమయిన సేయ్' అంది యల్లమ్మ.

'ఈ పూటకి పిండి వుంది. ఏడెనిమిది రొట్టె లవుతాయి. పొద్దు నొండిన బువ్వకూడా కొంచెముంది. ఈ పూటకి సరిపోతాది. దాంట్లోకి పుండుకూర(గోంగూర) సేత్తాను' అంది రామలక్ష్మి తలను విదిలించుకుంటూ.

'పుండ్కూరో, గిండ్కూరో ఏదో వొగటి సేయ్.' జివ్వుమని వీస్తున్న చల్లని గాలికి వణుకుతున్న శరీరాన్ని

అతుకుల బొంతతో రక్షించుకుంటూ. 'రారా, సిన్నోడా, ఆ దుబ్బన్న సినవ్వ దగ్గర రెండు వుండ్కార కట్లు తీస్కోత్తువు రా' అని చిన్న కొడుకుని పిలిచింది రామలక్ష్మి.

ఎండిన రొట్టెముక్కల్ని తింటున్న సిన్నోడు 'పోమ్మా! పో!! నేను పోను. నా కాలికి పుండయింది. వానలో తడిస్తే సీము పడతాది. నేను పోను. అన్నని వంపించు' అన్నాడు.

'పొద్దున దరమాసువత్రికి పొమ్మంటిని గదరా పోలేదా'ని అడిగింది రామలక్ష్మి.

'మాయవ్వ దుడ్లియలేదు. దరమాసుపత్రికి పోతాను ఒక రూపా యిమ్మంటే ఇయ్యలేదు.' చెప్పాడు సిన్నోడు.

'పుండయినప్పుడే నేను సెప్తి మీ యవ్వకి. ఆసువత్రికి తీస్కోపొమ్మని. నా మాట మీ యవ్వ సెవి కెక్కుతాదా? ఆఁ...అ దేమవుతుంది. అ దేమవుతాది అనబట్టి ఇప్పుడు సూడు వుండెంత పెద్దగయిందో!' అంటూ సిన్నోడి కాలుని పరీక్షగా చూడబట్టె రామలక్ష్మి.

'వూఁ... పోనీలే. రేప్పొద్దున యాపాకు వసరు పిండుతాలే. నీవు పోరా శీనుగా. నీవు పోయి వుండ్కార తీసుకొనిరా' అంది యల్లమ్మ.

'మరి దుడ్లు.' చెయ్యి చాచి అడిగాడు.

'దుడ్లు మీ యమ్మతోనే. నాతో లేవప్పా' అంది యల్లమ్మ.

బొడ్లో దోపుకున్న సంచీని చేత్తో తడుముతూ....'నాతో కూడా దుడ్లు లేవురా. రెండ్రూపాయలే వుంది. రేపు గిరిణి(పిండి మిషను)కి కావాలి. ఆ దుబ్బన్న సినవ్వకి సెప్పు పో. మా యమ్మ కింకా కూలీయలేదని. శనార మిస్తారంటని సెప్పి రెండు కట్ల వుండ్కార తీసికొనిరా. వొక రూపాయి వచ్చి మిరవకాయలు కూడా పట్రా. తొందరగా రా. పొయ్యంటిస్తాను' అంది రామలక్ష్మి.

రామలక్ష్మి పొయ్యి అంటించడానికి ప్రయత్నాలు మొదలెట్టింది. కట్టెలపొయ్యి. తడిసిన కట్టెలు. నిప్పు రాముకోవడం లేదు. దీపం బుడ్డిలోనున్న కిరోసిన్ని పొయ్యిమీద పోసి పుల్ల గీచింది. గుప్పుమని మంట మండుకుంది. అంతలోనే ఆరిపోయింది. ఆ పొయ్యిలో నుండి పొగలు లేచాయి. ఇల్లంతా పొగ కమ్ముకొని కళ్లలో మంటలు రేపింది. కళ్లల్లోంచి నీళ్లు కారుతుంటే 'ఉఫ్... ఉఫ్' మంటూ పొయ్యి వూదుతూ యాతన పడుతూంది రామలక్ష్మి.

శీనుగాడు సరుకులు పట్టుకొచ్చాడు. శీనుగాడు, యల్లమ్మ, సిన్నోడు ఓ మూలకి కూర్చొని గోంగూర, పచ్చిమిరపకాయలు ఒల్చడం మొదలెట్టారు.

రామలక్ష్మి పొయ్యితో తలపడుతూంది.

ఎలాగైతేనేం వూదుతూ, చీదుతూ వంటలు వండేసరికి రాత్రి ఎనిమిది దాటింది. అప్పటికే సిన్నోడు యల్లమ్మవ్వ వెచ్చని ఒడిలో ఆదమరిచి నిద్రపోతున్నాడు.

'బువ్వ తిందువులేరా' అని సిన్నోడ్ని తట్టితట్టి నిద్రలేపి కూచోబెట్టింది యల్లమ్మ.

రామలక్ష్మి కంచాలు కడిగి అందరికీ వడ్డించింది. అందరూ తినడానికి కూర్చున్నారు. రామలక్ష్మి అన్నం, గోంగూర కలిపి ముద్దచేసి సిన్నోడి నోటి కందించబోతుంటే జీపు వచ్చిన శబ్దం వినిపించింది.

'ఎమ్మెల్యే జీపనుకుంటాను. నీ కొడుకొచ్చినట్లున్నా డత్తా' అంది రామలక్ష్మి యల్లమ్మ వంక చూస్తూ.


'సూడ్రా మీయవ్వ వొచ్చినాడేమో!' అని శీనుగాడ్ని చూచి రమ్మంది యల్లమ్మ.

శీనుగాడు బయటకొచ్చి చూసేసరికి ఎమ్మెల్యే జీపొచ్చి యల్లమ్మ ఇంటిముం దాగింది. జీపులో నున్న పది పన్నెండు మంది దిగారు. అందరూ ఎమ్మెల్యే మనుష్యులే. అందులో ఎమ్మెల్యే బామ్మర్ది ముసల్రెడ్డి కూడా వున్నాడు.

'దస్సిగిరి మామా! మా యవ్వ రాలేదా?' అనడిగాడు శీనుగాడు.

## పురుషులకు కూడా...

మరేనట. మహిళలు గర్భనిరోధకానికి బిళ్లలు వేసుకోవటం అందరికీ తెలిసిన విషయమే. కానీ పురుషు లెప్పుడైనా అలాంటివి చేయగా చూశారా? ఇకనిప్పుడది కూడా జరుగుతుందంటున్నారు బ్రిటిష్ వైజ్ఞానికులు. వాళ్లు పురుషుల కోసం గర్భనిరోధకమాత్రలను తయారు చేశారట. కాని



వీటిని నోటి ద్వారా తీసుకోరు. చర్మంలో ఇంప్లాంట్ చేస్తారు. ఇందు లోంచి ఒక సింథెటిక్ హార్మోన్ స్రవించి, శుక్రాణువులనూ, టెస్టోస్టెరోన్ హార్మోన్ తయారు కాకుండా నిరోధిస్తుంది. దీన్ని శరీరంలో మూడేళ్లపాటు వుంచుకోవచ్చు. వద్దనుకుంటే తీసేయొచ్చు. దీని వల్ల దుష్పరిణామాలేవీ కలగవు.

ఎన్.

'వొత్తా డొత్తాడురా...యెన్కిలొత్తాడు' అని కొంచెము వొణుకుతున్న స్వరంతో సమాధాన మిచ్చాడు దస్తగిరి.

అప్పుడే అక్కడికి చేరుకున్న రామలక్ష్మి కూడా తన భర్తను గురించి ఆత్రతగా అడిగింది. ఎందుకంటే ఎమ్మెల్యే రాజేశ్వరరెడ్డి, రామచంద్రారెడ్డి మనుష్యులు పొద్దున పదిగంటలప్పుడు బాంబు లేసుకున్నారని వార్త వూరంతా పాకిపోయింది. అందుకే యల్లమ్మకూడా బయటికొచ్చి కొడుకు గురించి వాకబు చేసింది.

రాజేశ్వరరెడ్డి, రామచంద్రారెడ్డి వర్గాలు అడపా దడపా బాంబు లేసుకోవడం సర్వసాధారణం.

ఒక విచిత్రమేమంటే దాదాపు పాతికేళ్లు పైగా రామచంద్రారెడ్డి, రాజేశ్వరరెడ్డి వర్గాల మధ్య కొట్లుకోవడాలు, నరుక్కోవడాలు, బాంబు లేసుకోవడం జరిగినప్పటికీ ఇటు రాజేశ్వరరెడ్డికి గాని, అటు రామచంద్రారెడ్డికిగాని చిన్న గాయాలైన దాఖలాలు కూడా లేవు. ఇటు తలకాయ లెగిరినా, అటు తలకాయ లెగిరినా ఎటుదిరిగి నష్టపోయేదీ, ప్రాణాల్ని కోల్పోయేది మద్యానికి బానిసైన అట్టడుగు వర్గాలే. బతకలేక ఏదో ఒక వర్గాన్ని ఆశ్రయించిన బడుగుజీవులే. అందుకే తన భర్తను గురించి తెగ ఆత్రత పడుతూంది రామలక్ష్మి.

'వొత్తాడు వొత్సాడు పాప. యెన్కిల జీపులో వొత్తాడు' అని ఆదాము చెబుతుంటే ముసల్రెడ్డి ఆదాము చెవిలో ఏదో మెల్లిగా వూదాడు.

అప్పుడు ఆదాము గొంతు సవరించుకొని, 'యేం లేదమ్మా! పొద్దున్న కర్నూలుకి పోతా వుంటిమి. రెడ్డికి కోర్టు వాయిదా వుండె. రెడ్డి, రెడ్డి తమ్ముడు, రెడ్డి బామ్మర్ది, మేము అందరం కల్సి మూడు జీపుల్లో కర్నూలుకి పోతావుంటిమి. మన వూరి నాలుగో మైలు రాయికాడ సింత తోపుల్లో దాక్కుని రామచంద్రారెడ్డి మనుష్యులు బాంబు లిసినారు' అన్నాడు.

బాంబు లనగానే రామలక్ష్మికి, యల్లమ్మకి గుండెల్లో గుబులు పుట్టింది. రాయలసీమ గడ్డమీద పుట్టిపెరిగిన
రామలక్ష్మికిగాని,
యల్లమ్మకిగాని
బాంబులంటే భయంలేదు గాని...రామలక్ష్మి భర్త నాగన్న తప్ప మిగిలిన రాజేశ్వరరెడ్డి మనుష్యు లందరూ వచ్చారు. అదే వారి బుగులుకి కారణం.

రామలక్ష్మి, యల్లమ్మ ముఖాల్లో గూడుకట్టుకున్న దుఃఖాన్ని చూచి జీపు డ్రైవర్ ఆంజనేయులు 'నీవేం భయపడొద్దక్కా...మా బావకేం కాలేదులే. సిన్న దెబ్బలు తాకి వుంటే పెద్దాసువత్రికి తీస్కోబో యింటిమి. డాట్లర్లు

పరీచించి బళ్లారాసుపత్రికి ఎత్తమంఁడ్రి' అంటూ ఇంకా ఏదో చెబుతుండగా మధ్యలో యల్లమ్మ కల్పించుకొని 'అన్ని దెబ్బలు తాకినాయా నా కొడుక్కి' అని ఆందోళనని వ్యక్తపరిచింది.

'దెబ్బలు లేదు, గిబ్బలు లేదు. బళ్లా రాసుపత్రికి తీసుకొనిపోయినాంక నాకేం కాలేదు; న న్నెందుకు ఇక్కడికి తీసికొచ్చినారు...ఇంటికి తీసుకొని పాండి ఆని అంటే ఇంటికి తీస్కొస్తమి. యెన్కల అంబులెన్సులో వొస్తాడ'ని ముసల్రెడ్డి చెప్పాడు.

వర్షం పూర్తిగా తెరిపివ్వక అప్పుడప్పుడు వుండుండీ జల్లుల్ని కురిపిస్తూనే వుంది. అడపా దడపా ఉరుములు ఉరుముతూనే వున్నాయి. మెరుపులు మెరుస్తూనే వున్నాయి.

అంతలోనే మారెమ్మ గుడిదాటి ఓ జీపు, దాని వెనుక ఓ అంబులెన్సు రావడం చూసిరి. వాటిని చూడగానే యల్లమ్మకి, రామలక్ష్మికి ఏదో ఒక అపశకునంలా తోచె. వారి గుండెలో భయం చోటుచేసుకొనె. జరుగరాని దేదీ జరుగకూడదని వాళ్లు మనసుల్లో దేవుణ్ణి వేడుకున్నారు.

వాళ్ల మొర దేవుడు ఆలకించాడో లేదో తెలియాలంటే అంబులెన్సు రావాలి కదా!

రావాల్సిన అంబులెన్సు రానే వచ్చింది. దేవుడు వారి మొర ఆలకించలేదని అంబులెన్సు నుండి దిగిన యల్లమ్మ కొడుకు నాగన్న కాదు... కాదు; అంబులెన్సు నుండి దించిన యల్లమ్మ కొడుకు నాగన్న శవం తేల్చి చెప్పింది.

అందరూ ఓయని ఏడవడం మొదలుపెట్టిరి. చుట్టుపట్ల వున్నవారంతా వచ్చిరి. బంధు బలగమంతా పోగయ్యిరి. అందరూ కన్నీరు మున్నీరుగా విలపించిరి.

రామలక్ష్మి గుండెలు బాదుకొని ఏడుస్తాంది. వెనుక వచ్చిన జీపులోంచి రాజేశ్వరరెడ్డి దిగాడు.

'దొరా! నా మొగుడు మమ్ముల్నందర్నీ ఇడిసిపెట్టి పోయె. మా కన్యాయం సేసి పోయే. నా పిల్లల్ని అనాధుల్ని సేసిపోయె. ఈ పసికూనల్ని ఎట్లా సాకేదీ, ఈళ్లని ఎట్లా పెంచి పెద్దసేసేది' అని రాజేశ్వరరెడ్డిని చూచి ఏడ్వసాగింది.

'ఏం భయపడవద్దు. అన్నిటికీ నే నున్నాను. మిమ్ముల్నందర్నీ ఆదుకుంటాను. మీ కేలోటు రానీయ'నని ఓదార్చాడు.

ఆకాశంలో తళుక్కు తళుక్కుమని మెరుపులు మెరుస్తున్నాయి. అప్పుడప్పుడు ఉరుములు కూడా చిన్న చిన్నగా ఉరుముతున్నాయి. సహజంగా సౌందర్యవతైన రామలక్ష్మి ఆ మెరుపు వెలుగులకి మరింత ఆకర్షణీయంగా కనపడింది రాజేశ్వరరెడ్డి కళ్లకి.

'బామ్మర్ది! ఫిగరు సూపర్‌గుంది' పక్కనున్న ముసలిరెడ్డి చెవిలో మెల్లిగా అన్నాడు రాజేశ్వరరెడ్డి.

'అవును, బావా, దీనిది అదిరిపోయే అందం. దీన్ని త్వరగా మన గెస్ట్‌హౌస్‌లో వుంచే ఏర్పాట్లు చేద్దాం. నా సామిరంగా! దీన్ని సూత్తుంటే నా తలకాయేం పన్జెయడం లేదు, బావా' అన్నాడు ముసలిరెడ్డి.

'ఇప్పుడా చంద్రవమ్మతో యేం మజా రాదు, బామ్మర్ది, అటెండర్ల తగాదాల్లో ఎంకటిగాడు సచ్చి ఏ సర్గానున్నాడో తెలియదుగాని వాడిపెళ్లాం మాత్రం మనకు స్వర్గ సుఖాలు చూపించిందిరా బామ్మర్ది.' అన్నాడు రాజేశ్వరరెడ్డి.

'ఆ స్వర్గసుఖాలు ఇప్పుడు కాదు; ఒకప్పుడు. ఇప్పుడు దాంతో యేం పసలేదు. మజా రాదు. దానికి మనం పెట్టే తిండంతా వేస్ట్. ఒకపని చేద్దాం. ఆ చంద్రవమ్మని బొంబాయికి తీసుకొనిబోయి కామాటిపురంలోనో, సోనాపురం లోనో అమ్మేద్దాం. పాపం విధవరాలని కూడు పెట్టిన పాపానికి మనింట్లో దొంగతనం చేసి పారిపోయిందని వూర్లో వాళ్లని నమ్మిద్దాం. ఎలా వుంది, బావా, మన ఐడియా?' అన్నాడు ముసల్రెడ్డి.

అక్కడ నాగన్న శవం మీదపడి అందరూ వలవలమని విలపిస్తూంటే, ఇక్కడ వీరిద్దరూ ఎత్తుజిత్తుల పన్నాగాలు పన్నుతున్నారు.

'నీ ఐడియా బ్రహ్మాండం. ఇక ఈ చిలుక మన చేతికొస్తుంటే, ఆ చంద్రమ్మతో మనకేం పని? దాన్ని బొంబాయికి తీసుకొని పోయి అమ్మే ఏర్పాట్లు చూడుమరి' అన్నాడు రాజేశ్వరరెడ్డి.

'ముందు వీడి కర్మకాండలన్నీ పూర్తికానీలే' అన్నాడు ముసల్రెడ్డి.

***

చనిపోయిన తన భర్తకు చేయాల్సిన కర్మకాండలన్నీ పూర్తి చేసింది రామలక్ష్మి. తన భర్త జ్ఞాపకాల నీడల్లోనే విషాదంగా దినాల్ని వెలిబుచ్చుతూంది.

ఒకానొక రోజు పొద్దున్నే ఎమ్మెల్యే మనిషి సైకిల్ వేసుకొచ్చి 'అక్కా! రేపొద్దునే హైదరాబాదునుండి వస్తాడు. రేపు సాయంత్రానికంతా రెడీగా వుండు. జీపు పంపిస్తాడు' అని చెప్పి వెళ్లిపోయాడు.


ఎమ్మెల్యే మనిషి వచ్చిపోయినప్పట్నుంచీ రామలక్ష్మి హృదయం వ్యాకులమైంది. కన్నులు మూసినా, తెరిచినా చనిపోయిన భర్తే గుర్తు కొస్తున్నాడు. తన భర్త ఎంత తాగినా, ఎంత తిరిగినా తనను మాత్రం చాలా ప్రేమగా చూసుకుంటుండేవాడు. పిల్లల్నీ మరీ గోము చేస్తుండేవాడు. అలాంటి మంచి మనిషికి నేనెట్ల అన్యాయం చేసేదని విచారింప మొదలుపెట్టింది. అతని ఆత్మను ఎట్లా క్షోభ పెట్టేదని దుఃఖించింది. ముత్యాల్లాంటి ఇద్దరు కొడుకులు, వారిని దూరం చేసుకుని తనుండగలదాని దిగులు చెందింది. దిగులు చెందుతూ విషాదభరితమైన తన జీవితంలోకి ఒక్కసారి తొంగిచూసుకుంది రామలక్ష్మి.

తను పెద్దమనిషి కాగానే పెండ్లి చేసి అత్తవా రింటికి సాగనంపి, తమ గుండెలమీదున్న

## చెమ టోడ్చకుండా కండలు

పెంచుకోవచ్చునట. వ్యాయామాలు చేస్తున్నట్లు సీరియస్‌గా అనుకుంటే చాలట! అంటే మెంటల్ ఎక్సర్‌సైజ్ జన్నమాట. ఇరవై నుంచి ముప్ఫైయ్యేళ్లున్న యువకులు ఇరవై మందిని ఈ మెంటల్ ఎక్సర్‌సైజులు చెయ్యమనీ, మరో పదిమందిని వద్దనీ నియోగించి, పరిశీలించారట నిపుణులు. చేతుల మీద కండలు రావాలని అనుకుంటూ మనసులోనే వారాని కొరోజు పావు గంట చొప్పున పన్నెండు వారాలపాటు వ్యాయామం చేసిన పది మందికీ 13.5 శాతం కండలు పెరిగాయట. మరో పది మంది తమ చిటికెన వేలితో ఓ బరువును ఎత్తినట్లుగా భావించుకున్నారట. వీరికి 35 శాతం వేళ్ల బలం పెరిగిందట. మూడో బృందం ఎలాంటి మెంటల్ ఎక్సర్‌సైజూ చెయ్యలేదు కనుక వారిలో ఎలాంటి మార్పు లేదట. ఇట్లా చేయటం అసలైన వ్యాయామానికి ప్రత్యామ్నాయం కాదని ఓ సీనియర్ రిసెర్చ్ ఇంజనీర్ అంటున్నాడు. ఇలా మెంటల్ ఎక్సర్‌సైజ్ చేయటం వల్ల కేంద్రనాడీమండలం కండరాలకు మేలైన సందేశాలు పంపి, కండరాల టిష్యూలను ఉత్తేజితం చేస్తుంది. అందుకనే ఆ పద్ధతిలో కండరాలు పెరుగుతాయి.

ఎన్.



బండెడు బరువును దించుకున్నంతగా తృప్తి చెందారు తన తల్లిదండ్రులు. ఇప్పుడు ఈ అత్తవా రింటికొచ్చి పదిహేనేళ్లయింది. ఈ పదిహేనేళ్ల కాలవ్యవధిలో తన జీవితంలో ఎన్నో మార్పులు, చేర్పులు చోటు చేసుకున్నాయి. ఈ చిన్న కాలవ్యవధిలోనే విధి చాలా విచిత్రమైన, విషాదభరితమైన ఎన్నో సంఘటనల్ని జరిపించింది.

సారా తాగి తాగి తన అయ్య చనిపోయాడు. ఆ దిగులుతోనే అమ్మ మంచం పట్టి కాలం చెల్లిపోయింది. నా కొడుకు చెడిపోయా నా కొడుకు చెడిపోయని దిగులుతో తన మామ (భర్త తండ్రి) కన్ను మూసె. ఇప్పుడు తన భర్త తిరిగిరాని సుదూర తీరాలకు సాగిపోయె.



అమ్మ, అయ్య కాలం చెల్లిపోయాకా తన భర్తే తనకు అమ్మా, అయ్య అయ్యి అయినదానికి, కానిదానికి అండగా వుండేవాడు.

తను పోతూ పోతూ తనకు ప్రతిరూపాలుగా ఆణిముత్యాల్లాంటి ఇద్దరు కొడుకుల్నిచ్చి వెళ్లిపోయాడు.

సర్వం కోల్పోయిన రామలక్ష్మి ఆ ఇద్దరు కొడుకులే తనకు, తన శేష జీవితానికి స్థిర, చరాస్తులని భావించింది.

జ్ఞాపకాల్ని తవ్వి చూచుకోవడంలోనో ఆరోజు పొద్దంతా గడిచిపోయింది. సూర్యుడు పడమట నడుం వాల్చాడు. చీకట్లు ముసురుకొనెను. దీపమంటించి, గుడిసెలో ఓ మూలగా కూర్చొని ఏడ్వబట్టె.

తెల్లారితే సారొస్తాడు. తన మనుష్యులతో జీపు పంపిస్తాడు. రానని ఖరాఖండితంగా చెప్పినా ఫలిత ముండదు. బలవంతంగానైనా తీస్కపోతారు.

ఆ రాత్రంతా అత్తాకోడలు ఒకర్నొకరు కౌగలించుకొని తనివి తీరా ఏడ్చారు.

వాళ్లలా ఏడుస్తుంటే సగం అర్థమై, సగం అర్థంకాక శీనుగాడు ఎక్కెక్కి ఏడుస్తున్నాడు. ఏమీ అర్థం కాక సిన్నోడు దిగులుగా అమ్మని, అవ్వని, అన్నని మార్చి మార్చి చూస్తున్నాడు.

కాంతులు తొణికిసలాడాల్సిన ఆ పసివాని ముఖంలో అలుముకున్న దిగులుని చూసి కన్నపేగు తరుక్కుపోయింది రామలక్ష్మికి. సిన్నోడ్ని అక్కున చేర్చుకుని గుండెలు బాదుకుంది.

ఏడ్చి ఏడ్చి కన్నీళ్లే ఎండిపోయాయో కను పాపలే అలిసిపోయాయో తెలియదు గాని, నడిరేయి వేళకి సిన్నోడు, శీనుగాడు, యల్లమ్మ కటిక నేలపై కునుకు తీస్తున్నారు. రామలక్ష్మికి మాత్రం నిద్రపట్టలేదు. మండేదీపం వంక తీక్షణంగా చూస్తూ, తీవ్రంగా ఆలోచిస్తూంది.

ఎమ్మెల్యే కంటికి ఎవరు అందంగా కనబడ కూడదు. వాని కంటికి ఎవరు అందంగా కనబడితే వారిని లొంగదీసుకోడానికి సామ, దాన, దండోపాయాల్ని ప్రయోగిస్తాడు. ఆత్మాభిమానాన్ని చంపుకోలేక, ఆత్మగౌరవాన్ని పోగొట్టుకోలేక కాదు కూడదని, తిరస్కారభావంతో భీష్మించి కూర్చుంటే ఆమె భర్తని తప్పుడు కేసుల్లో ఇరికించి జైలుపాలు చేయడమో, లేక సరాసరి స్వర్గానికి పంపడమో చేస్తాడు.

అధికారము, ఆధిపత్యాన్ని ఆసరా చేసుకొని వీరు చేస్తున్న ఆగడాలు, అరాజకాలు అంతా ఇంతా కాదు. గత ఎన్నో ఏళ్లుగా వీళ్లు వెలగబెడుతున్న వ్యవహార మిదే.

మీరు చేస్తున్నది అన్యాయమని ఎదురు తిరిగిన మనిషే లేడు. ఒకవేళ అలా ఎవరైనా ఎదురుతిరిగినా రాత్రికి రాత్రే ఆ మనిషికి గొయ్యి తవ్వుతారని అందరికీ తెలుసు. అందుకే ఎవ్వరూ సాహసించలేక పోతున్నారు.

వాని అధికారం ఉక్కు పాదాలకింద ఎన్ని సంసారాలు నాశన మయ్యాయో లెక్కే లేదు. అలా సంసారాలు నాశనమైన వారు తలెత్తుకొని తిరగలేక వూరొదిలి వెళ్లిపోవడం తప్ప ఇంతవరకూ ఏమీ చేయలేదు.

సూర్యుడు తూర్పుతీరాన్ని ఎరుపెక్కించే సమయానికి ఆమె ఒక నిర్ణయాని కొచ్చింది. ఒక దృఢమైన నిర్ణయాన్ని తీసుకుంది. ఒక బలమైన లక్ష్యాన్ని చేపట్టింది.

కోపంతో పిడికిలి బిగించి, పళ్లు పట పటామని కొరుకుతుంటే ఆమె కళ్లు అగ్ని కణాల్ని వర్షించేట ట్లున్నాయి.

తెల్లారింది. వూరు మేల్కొంది. అందరూ ఎవరి పనులకు వాళ్లు ఉపక్రమించారు.

ఆ సాయంత్రం ఎమ్మెల్యే జీపొచ్చి యల్లమ్మింటిముం దాగింది. తన ఇద్దరు కొడుకులు, అత్త యల్లమ్మల యొక్క ఆవేదనలు, ఆర్తనాదాల మధ్య రామలక్ష్మి జీపెక్కింది.

విలువైన, అపురూపమైన దానినేదో చేజిక్కించుకొన్న తర్వాత ఇక ఎవరితో యేం పని లేదన్నట్లు రయ్యిమని ఆ జీపు ముందుకు దూసుకుపోయింది. ఆ రాత్రి యల్లమ్మ కంటికి కునుకుకూడా దూరమయింది. దాదాపు నడిరేయి సమయంలో తన ఇంటి వెనకల నున్న బావిలో ఏదో పడిన శబ్దం వినిపించింది. ఏమిటా శబ్దమని ఆలోచిస్తుండగానే తలుపుతట్టిన చప్పుడయ్యింది. లేచి తలుపుతీసింది. ఆశ్చర్యపోయింది యల్లమ్మ.

ఎదురుగా రామలక్ష్మి.

లోపలికి రమ్మన్నట్టు పక్కకి జరిగి దారిచ్చింది. లోపలికి వచ్చిన రామలక్ష్మిని ఏదేదో ప్రశ్న లడిగింది యల్లమ్మ. అన్నింటికీ కలిపి ఒకే సమాధాన మిచ్చింది--తెల్లారేసరికి నీ ప్రశ్న లన్నింటికి జవాబు దొరుకుతుందని.

రామలక్ష్మి హాయిగా నిద్రపోయింది.

తూరుపు తెలతెలవారుతుండగానే కూతవేటు దూరంలో నున్న టౌన్ నుండి ఆఘమేఘాలమీద వార్తొచ్చింది. గెస్ట్ హౌస్‌లో ఎమ్మెల్యేని ఎవరో నరికి చంపారని.

యల్లమ్మకి అప్పు డర్థమయింది. రాత్రి తన ఇంటి వెనకాల నున్న బావిలో నుంచి వచ్చిన శబ్దం ఏదో కాదు...అది రామలక్ష్మి విసిరేసిన గొడ్డలి శబ్దమని.

ఏమీ ఎరుగనట్లు తన పనిలో లీనమైన రామలక్ష్మిని చూస్తుంటే ఊరికి కొత్తవెలుగును మోసుకొచ్చిన తూరుపు తీరంలా ఉంది. ■

## తల్లికి జుట్టు రాలుతుందా?

ప్రసవం తరువాత మహిళల జుట్టు రాలిపోవటం మామూలుగా జరుగుతుంటుంది. దాని వల్ల శిశువు కాలి వేళ్లలో నొప్పి కలుగుతుందంటున్నారు పరిశోధకులు. కాలి వేళ్లు వాస్తాయట కూడా. బాలింతకు నాలుగు నెలల దాకా జుట్టు రాలుతుంటుంది. అలా రాలిన జుట్టు ఎంత జాగ్రత్తగా చూసుకున్నా శిశువుల కాలి వేళ్లకు తగులుకుని చుట్టుకుపోతాయట. అందువల్ల కాలి వేళ్లు వాచి ఎర్రబడటం, రక్తం రావటం జరుగుతాయి. అతిసున్నితంగా, లేతగా వుండే శిశువుల చర్మానికి కేశాలు చుట్టుకుంటే కలిగే బాధ ఎట్లా వుంటుందో వారికే ఎరుక! ఒక పిల్లల వైద్యుడు తన పిల్లల్లో ఇట్లాంటిది చూశాడట. ఎంతో నేర్పుగా, జాగ్రత్తగా వ్యవహరించి, వాటిని తీసేసి కాలి వేళ్లకు చికిత్స చేశాట్ట. దీని వల్ల కండరాలకు దెబ్బ తగలొచ్చుననీ, అది భవిష్యత్తులో వేరే సమస్యలకు దారి తీయొచ్చుననీ కూడా అంటున్నా డాయన. అందుకని తల్లులు తల దువ్వుకునేటప్పుడు రాలే జుట్టును శ్రద్ధగా తీసిపారేయాలని సలహా ఇస్తున్నాడాయన. అప్పుడప్పుడూ శిశువుల కాలి వేళ్లను కూడా పరిశీలించాలి.

ఎన్.